క్లుప్తంగా

నష్టపరిహారం అందజేయాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గూడూరు: కోట మండలం ఊనుగుంటపాళెం, రుద్రవరం పంచాయతీల పరిధిలోని గ్రామస్తులు సోమవారం గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌కు స్పందనలో వినతిపత్రం అందజేశారు. సాగరమాల రోడ్డు నిర్మాణంలో భాగంగా మా గ్రామాల్లో భూములు తీసుకుంటున్నారన్నారు. అయితే భూములు ఇస్తున్న రైతులకు నష్టపరిహారం వెంటనే అందజేయాలని తెలిపారు. భూముల ధరలు ఎక్కువగా ఉండడంతో ధరలను బట్టి నష్టపరిహారం కూడా పెంచాలని కోరారు.

సాంకేతిక సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఈనెల 15వ తేదీ సీఎస్‌ఈ విభాగం ఆధ్వర్యంలో టెక్ వ్యూ–2023 జాతీయస్థాయి సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో సాంకేతిక సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. డైరెక్టర్ మాట్లాడుతూ సదస్సుకు పలు రాష్ట్రాల్లోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ఆవిష్కరణలను ప్రదర్శిస్తారన్నారు. సీఎస్‌ఈ విభాగం హెచ్‌ఓడీ రాజశేఖర్‌రెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలను అందజేస్తున్న సర్పంచ్

సైదాపురం: మండలంలోని తూర్పుపూండ్ల గ్రామంలో సోమవారం ఐసీఐసీఐ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కళ్ల అద్దాలను సర్పంచ్ ముత్తుకూరు వెంకటరత్నమ్మ, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు అందజేశారు ఈసందర్భంగా గ్రామంలో ఉన్న ప్రజలకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా అద్దాలను పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. సిబ్బంది మస్తానమ్మ, గోపాల్, మస్తానయ్య పాల్గొన్నారు.

నకిలీ విలేకర్లపై ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న విలేకర్లు

దొరవారిసత్రం: దొరవారిసత్రం పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అక్రిడేషన్లు కలిగిన పలువురు మండల విలేకర్లు నకిలీ విలేకర్ల ఆగడాలపై ఫిర్యాదు చేశారు. విలేకర్లు అని చెప్పుకుంటూ కొందరు దందాలకు పాల్పడుతూ అధికారులను, ప్రజాప్రతినిధులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, ఎస్‌ఐ తిరుమలరావు దృష్టికి తీసుకెళ్లారు. నకిలీ విలేకర్ల సమస్యను డీపీఆర్‌ఓ దృష్టికి ఫోన్ ద్వారా తెలపగా ఆయన స్పందించి గుర్తింపులేని విలేకర్లపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

చెక్‌పోస్టులో విజిలెన్స్ తనిఖీలు

తడ: ఆంధ్రా నుంచి తమిళనాడుకు ఖనిజ సంపద అక్రమంగా తరలిపోతున్న సమాచారంతో ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాల విజిలెన్స్ అధికారులు సోమవారం బీవీపాళెం ఉమ్మడి తనిఖీ కేంద్రం వద్ద తనిఖీలు నిర్వహించారు. ఎర్రచందనం, గ్రావెల్, ఇసుక ఇతర అక్రమరవాణాపై నిఘాపెట్టిన అధికారులు సిబ్బందితో కాపుకాచి ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి వివరాలు సేకరించారు. తనిఖీలు జరుగుతున్న విషయం తెలుసుకున్న అక్రమ రవాణాదారులు గప్‌చుప్‌గా ఉండిపోయారు. తనిఖీల్లో చిత్తూరు, నెల్లూరు జిల్లా అధికారులు శ్రీనివాస్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి



మాట్లాడుతున్న సుశీలాదేవి

గూడూరురూరల్: 2016 సంవత్సరానికి ముందు ఆధార్ కార్డు తీసుకున్న వారందరూ తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలని గ్రామ, వార్డు సచివాలయ తిరుపతి జిల్లా ఇన్‌చార్జి సుశీలదేవి అన్నారు. గూడూరులోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గూడూరు, నాయుడుపేట డివిజన్‌లలోని ఎంపీడీఓలు, శిశు సంరక్షణ శాఖ సిబ్బంది, ఆధార్ కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆధార్ కార్డును సమీపంలో ఉన్న సచివాలయాల్లో సంప్రదించి అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. సచివాలయాల్లో పాస్‌పోర్టు అప్లికేషన్, రైల్వే రిజర్వేషన్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అన్ని సేవలు అందిస్తున్నారని తెలిపారు. డీఎల్‌డీఓ వాణిరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి



పోలేరమ్మను దర్శించుకున్న నేదురుమల్లి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



మాట్లాడుతున్న నేదురుమల్లి, చిత్రంలో ఎంపీ డాక్టర్ గురుమూర్తి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

వెంకటగిరి: గ్రామస్వరాజ్యం దిశగా మండల స్థాయిలో ఉన్న పాలనను సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామస్థాయికి చేరువచేయడమే కాకుండా అర్హులందరికీ సంక్షేమం అందించాలని వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి దేశంలోని పలు రాష్ట్రాలు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనను ఆదర్శంగా తీసుకుంటున్నారని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎస్ఆర్ కల్యాణమండపంలో వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నేతలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తనను వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు అండగా, అందుబాటులో ఉండేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవకాశం ఇచ్చారని, ఆయన తనపై ఉంచిన నమ్మకాన్ని బాధ్యతగా భావించి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించేలా పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం.గురుమూర్తి మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గం అభివృద్ధికి ఎంపీ నిధుల ద్వారా కృషిచేస్తున్నట్లు తెలిపారు. పలు ఎక్స్‌ప్రెస్‌రైళ్ల వెంకటగిరి స్టేషన్‌లో స్టాపింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సామాజిక న్యాయం అమలు చేయడంలో దేశానికే ఆదర్శమని తెలిపారు. అంతకుముందు పోలేరమ్మ ఆర్చిసెంటర్ నుంచి పార్టీ శ్రేణులు మోటారుసైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. గజమాలలతో నేదురుమల్లి, ఎంపీ, ఎమ్మెల్సీలను సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, నెల్లూరు జిల్లా గ్రంథాలయసంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, నేదురుమల్లి తనయుడు విక్రమ్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ఎస్ బాలయ్య, ఉమామహేశ్వరి, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఢిల్లీబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలు ధనియాల రాధమ్మ, మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి, మున్సిపల్ లీగల్ అడ్వైజర్ జయప్రకాష్‌శెట్టి, న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

పోలేరమ్మ సేవలో నేదురుమల్లి..

వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఆలయంలో నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, తనయుడు విక్రంరెడ్డి, కుమార్తె అలేఖ్య, ఎంపీ డాక్టర్ ఎం.గురుమూర్తి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌లతో కలిసి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ శ్రీనివాసులు రెడ్డి వారికి ప్రత్యేక దర్శనం కల్పించారు. నేతలు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి, పట్టణ జేఎస్‌సీ కన్వీనర్ పులిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై సమావేశం



సమావేశంలో ఎన్నికల ప్రత్యేకాధికారి చంద్రమౌళి, ఆర్డీఓ చంద్రముని

సూళ్లూరుపేట: ఈనెల 13న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో తహసీల్దార్లు, పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులతో సోమవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రత్యేక అధికారి చంద్రమౌళి, ఆర్డీఓ చంద్రముని ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించి సలహాలు, సూచనలు ఇచ్చారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, ర్యాంపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రత్యేక అధికారి చంద్రమౌళి మాట్లాడుతూ ప్రస్తుతం జరుగనున్న ఎమ్మెల్సీ ఓట్లు ప్రాధాన్యతా క్రమంలో వేయాలని తప్పుగా వేసినా ఓట్లు చెల్లవని అన్నారు. ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా జరిపించేందుకు అధికారులంతా సమష్టిగా పనిచేయాలని కోరారు.

దుకాణాల సముదాయం నిర్మాణంపై పరిశీలన



పరిశీలన చేస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా దుకాణాల సముదాయం నిర్మాణం చేపట్టే విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఇంజినీరింగ్ విభాగ కార్యదర్శులతో కలిసి సోమవారం పరిశీలన చేశారు. పట్టణంలో దుకాణాల సముదాయానికి సంబంధించి త్వరిగతిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదేశించడంతో అధికారులతో కలసి నిర్మాణాలు, నమూనా విషయాలపై చర్చించారు. పట్టణంలోని సీఎస్ తేజ థియేటర్ సమీపంలో ఉన్న మున్సిపాలిటీ స్థలం వద్ద కొత్తగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల సమీపంలో శిథిల స్థితిలో ఉన్న నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి దుకాణాల సముదాయం పగులగొట్టి కొత్తగా చేపట్టే నిర్మాణాలపై పరిశీలనలు చేశారు. బేస్‌మట్టం స్థాయి నుంచే పిల్లర్లు వేసి రెండు ఫ్లోర్లలో 60 దుకాణాలను నిర్మాణం చేసే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి పెద్దపీట



నేదురుమల్లితో నాయీబ్రాహ్మణ సేవా సంఘం నేతలు

వెంకటగిరిరూరల్: నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేసి పాలన అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నేదురుమల్లి నివాసంలో సోమవారం నాయీబ్రాహ్మణసేవా సంఘం ఉపాధ్యక్షుడు మంగళాపురి వెంకటేశ్వర్లు, మాజీ జిల్లా సొసైటీ అధ్యక్షుడు వినుకొండ జనార్దన్ ఆధ్వర్యంలో నాయీబ్రాహ్మణ నాయకులు శాలువాలు, పుష్పాలతో మర్యాదపూర్వంగా కలిశారు. రాంకుమార్‌రెడ్డి మాట్లాడుతూ చేతి వృత్తిదారులకు, నాయీబ్రాహ్మణుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణుల సేవాసంఘం నాయకులు జొన్నవాడ గురువయ్య, గురునాథం, వరదరాజులు, ప్రకాష్, సురేష్, చక్రపాణి పాల్గొన్నారు.

వార్డుల ఉపఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పరిధిలోని 16, 19 వార్డులకు ఉపఎన్నికలను నిర్వహించేందుకు నాలుగు పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేశామని మున్సిపల్ కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్ తెలిపారు. 16వ వార్డుకు సంబంధించి పట్టణంలోని కచేరివీధిలో మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల 1వ తరగతి గది, హెచ్‌ఎం గదిని కేటాయించి రెండు పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 19వ వార్డుకు సంబంధించి సాయినగర్‌లోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల రెండవ తరగతి గదిన, ఐదవ తరగతి గదిని ఎంపిక చేశామని తెలిపారు. ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 7వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు కమిషనర్‌కు, లేదంటే వారి అనుమతిపొందిన కార్యాలయం మేనేజర్‌కు రాతపూర్వకంగా అభ్యంతరాలను సమర్పించాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం

డక్కిలి: డక్కిలిలో నేడు వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు జేసీఎస్ కన్వీనర్ చింతల శ్రీనివాసులరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో డక్కిలి మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం 4గంటలకు కార్యక్రమం జరగనుందని ఈ మేరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

అఖిలపక్ష సమావేశం నేడు

చిల్లకూరు: మండలంలోని ఓడూరు ఎంపీటీసీకి త్వరలో జరగనున్న ఉపఎన్నికలకు సంబంధించి మంగళవారం అన్ని పార్టీల నాయకులతో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు సోమవారం ఎంపీడీఓ విష్ణుచిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. ఓడూరు సెగ్మెంట్‌కు గతంలో ఎన్నికలు నిర్వహించగా అప్పట్లో గెలిచిన ఎంపీటీసీ రాజీనామా చేశారు. దీంతో ఓడూరు సెగ్మెంట్‌లో ఉప ఎన్నికలు అనివార్యం కావడంతో ప్రభుత్వం త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనున్న క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకుగాను అన్ని పార్టీల నాయకులు సమావేశానికి తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి



గూడూరులో ప్రచారం నిర్వహిస్తున్న పొనకా దేవసేనమ్మ

ఓజిలి: తూర్పురాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలుపొందేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. వెంకటరెడ్డిపాళెం పంచాయతీ పరిధిలోని ఎక్సైజ్ మద్యం గోదాములో పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. పట్టభద్రులు పోలింగ్ కేంద్రంలో ఓటు ఎలా వేయాలన్న దానిపై క్షుణ్ణంగా వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే కురుగొండ, ఓజిలి, వెంకటరెడ్డిపాళెం సచివాలయం పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలలు, సచివాలయాలు, పీఏసీఎస్, పోలీస్‌స్టేషన్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపొందాలని ఓజిలి మండల వైఎస్సార్‌సీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ అరుణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్రరాజు, జేసీఎస్ కన్వీనర్ ఖాదర్‌బాషా, యూత్‌అధ్యక్షుడు పృథ్వీకుమార్‌యాదవ్, నేతలు బాబురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుబ్బారావుయాదవ్, హరనాథ్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, దామోదర్‌రాజు, ప్రభాకర్‌రాజు, పిండుకూరు మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ రఘురామరాజు, రవీందర్‌రెడ్డి, రవి, పెంచలయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం..

గూడూరు: పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలకు మద్దతుగా సోమవారం రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పొనకా దేవసేనమ్మ పట్టణంలో ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని సీఎంఎస్ స్కూల్, మున్సిపల్ కార్యాలయం, సచివాలయాలు, పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఓటర్లను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు. నాయకులు బత్తిన విజయకుమార్, సుకన్య, బాలిపోయిన రమేష్, కిషోర్‌రెడ్డి, కోదండరామయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి..

సైదాపురం: వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని సైదాపురం, కమ్మవారిపల్లి, అనంతమడుగు, రామసాగరం గ్రామాల్లో సోమవారం మండల జేఎస్‌సీ కన్వీనర్ మన్నారపు రవికుమార్ ప్రచారం నిర్వహించారు. నేతలు నలమారు రాంగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులురాజు, సాంబయ్య, శివకుమార్, వెంకట్రాజు, కిషోర్, హరి, మురళి పాల్గొన్నారు.



పారిచెర్లవారిపాళెంలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి..

చిల్లకూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పారిచెర్లవారిపాళెం, చిల్లకూరు గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, ఏపీ గురుకుల పాఠశాలల్లో పార్టీ నేతలు కరపత్రాలను పంపిణీ చేసి ఓట్లను అభ్యర్థించారు. జెడ్పీటీసీ మన్నెం శీనయ్య, ఏఎంసీ డైరెక్టర్ సందానీ బాషా, ట్రేడ్ యూనియన్ కన్వీనర్ నందవరం సుబ్బారావు, సోషల్ మీడియా కన్వీనర్ విష్ణువర్ధనరెడ్డి పాల్గొన్నారు.



నాయుడుపేటలో ప్రచారం చేస్తున్న చైర్‌పర్సన్ కటకం దీపిక

ముమ్మర ప్రచారం..

నాయుడుపేటటౌన్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం కోసం సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, పార్టీ నాయకులు బైనా మల్లికార్జునరెడ్డి, కటకం జయరామయ్య కలిసి మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలను అందిస్తూ ప్రచారం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ పలువురు కౌన్సిలర్‌లతో కలసి పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఇళ్ల వద్దకు వెళ్లి పార్టీ నేతలు ప్రచారం చేశారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి



ఉపాధ్యాయులు, పట్టభద్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ముఖ్యమంత్రి జగనన్న నియమించిన అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులను, పట్టభద్రులను కలిసి జగనన్న బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే రాష్ట్రాభివృద్ధిని, సంక్షేమాన్ని మరింత ముందుకు తీసుకెళతారని తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన పారిశ్రామిక వేత్తల సదస్సులో రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులతో అనేక పరిశ్రమలు తీసుకొస్తున్నారని ఆయన అన్నారు. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతుందని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన పట్టభద్రులను, ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో పట్టణపార్టీ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, నేతలు గోగుల తిరుపాల్, మందా దేవేంద్రరెడ్డి, చిలకా యుగంధర్‌రెడ్డి, పర్వతరెడ్డి రవిరెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను వైభవంగా చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి

సూళ్లూరుపేట: అందరం కలిసి చెంగాళమ్మ పరమేశ్వరి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని, ఇందుకు భక్తులందరూ సహకరించాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోరారు. సోమవారం ఆలయ ఆవరణలో పట్టణంలోని అమ్మవారి భక్తులతో ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి అధ్యక్షతన అభిప్రాయసేకరణ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా అమ్మవారి బ్రహ్మోత్సవాల గురించి భక్తుల నుంచి సలహాలు, సూచనలను తీసుకున్నారు. అమ్మవారి తిరునాళ్లు చేస్తున్నందుకు సంతోషంగా ఉందని అందరూ ముక్తకంఠంతో చెప్పడం విశేషం. అయిదేళ్లకు ఒక్కసారి తిరునాళ్లు చేస్తునందుకు సంతోషంగా ఉందని, పట్టణమంతా ప్రజల సహకారంతో పండుగ వాతావరణాన్ని తీసుకురావాలని సలహాలిచ్చారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరినీ కలుపుకుని బ్రహ్మోత్సవాలను బ్రహ్మాండంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరి సహకారం కావాలని కోరారు. ఇది మనవూరు తిరునాళ్లు అనుకుని ప్రతిఒక్కరూ ముందుకు రావాలని, పార్టీలకతీతంగానే కమిటీలను కూడా వేస్తామని తెలిపారు. తిరునాళ్ల తేదీలను ఇప్పటికే ప్రకటించామని తెలిపారు. చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ రాజకీయ పార్టీలను పక్కన పెట్టి అమ్మవారి కార్యక్రమం అనుకుని అందరూ ముందుకొచ్చి సహకరించాలని ఆయన కోరారు. అనంతరం టీడీపీ నేత తిరుమూరు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ బాలచంద్రారెడ్డి చైర్మన్ అయిన తరువాత ఊహించిన రీతిలో అభివృద్ధి చేశారని దీనికి ఎమ్మెల్యే కిలివేటిని, వైఎస్సార్సీపీ నాయకులను అభినందించారు. బీజేపీ నేత తాటిపర్తి ఆదినారాయణరెడ్డి తిరునాళ్లకుగాను ముందుగా రూ.25,116 విరాళంగా ప్రకటించారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు, మాజీ చైర్మన్ కాళంగి ప్రభాకర్ వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ, సీపీఐ, సీపీఎం నాయకులతో పాటు పట్టణ ప్రజల అందరూ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పెళ్లకూరు: ఎండాకాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పుష్కలంగా మంచినీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నట్లు మండల పరిషత్ అధ్యక్షుడు పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ ప్రాంగణంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చే బాధ్యత పంచాయతీ సర్పంచులతో పాటు అధికారులు బాధ్యత వహించాలన్నారు. బంగారంపేట, రోసనూరు, చెన్నప్పనాయుడుపేట, శిరసంబేడు గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే రాజీవ్ టెక్నాలజీ మంచినీటి పథకం నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పలు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వెంటనే ఆశాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టి తాగునీరు సరఫరా చేయాలన్నారు. రైతుభరోసా పథకం సామాన్య రైతులకు అందుబాటులో ఉండేలా వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ కింద రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా పనులు చేయించాలన్నారు. ఎంపీడీఓ సురేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు నన్నెం ప్రిస్కిల్లా, మండల ఉపాధ్యక్షుడు బెల్లం రామరాఘవరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాపూరుకు చేరుకున్న స్కేటింగ్ బాలుడు



రాపూరులో వేదనరసింహ

రాపూరు: ప్రపంచ స్కేటింగ్ రికార్డులో స్థానం కోసం రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా ఆశీస్సులతో 270 కిలోమీటర్లు స్కేటింగ్‌లో పాల్గొన్న ఎనిమిదేళ్ల బాలుడు వేదనరసింహ సోమవారం రాపూరుకు చేరుకున్నారు. వెంకటగిరి నుంచి రాపూరు, పెంచలకోన, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు మీదుగా గూడూరు వరకు స్కేటింగ్‌గా చేరుకోవాల్సి ఉంది. సోమవారం రాపూరు చేరుకున్న వేదనరసింహకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందస్తుగా ఎస్‌ఐ క్రాంతికుమార్ చర్యలు తీసుకున్నారు.

నకిలీ విలేకరిపై చర్యలు తీసుకోండి



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వెంకటగిరిరూరల్: సోషల్ మిడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ తమను వేధింపులకు గురిచేస్తున్న నకిలీ విలేకరిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు స్వరూప డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ బారు జయకృష్ణ అనే వ్యక్తి ఫేక్ మీడియా ముసుగులో తమ అంగన్‌వాడీ కార్యకర్తలను, హెల్పర్‌లను కొద్దిరోజులుగా వేధింపులకు పాల్పడడంతోపాటు డబ్బులకు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఐసీడీఎస్ చేతివృత్తుల రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ చైర్మన్ భాస్కరయ్య, సీఐటీయూ జిల్లా నేతలు చెంగయ్య, మంజుల, అంగ్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతి విద్యాసంస్థకు గుర్తింపు



కిషోర్‌కు అవార్డు అందజేస్తున్న సుమన్

కోట: పట్టణంలోని ప్రగతి విద్యానికేతన్ ప్రిన్సిపల్ కిషోర్ విద్యారంగానికి చేస్తున్న సేవలకుగాను సీవీ రామన్ అకాడమీ సేవా సాంస్కృతిక సంస్థ అవార్డు ప్రదానం చేసింది. సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో హీరో సుమన్ చేతులమీదుగా గ్రామీణ విద్యావారధి బిరుదును ప్రదానం చేశారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ



గూడూరు: ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని సంస్థ కార్యాలయంలో డాక్టర్ సీఆర్ రెడ్డి ఆరోగ్య సంజీవని కార్యక్రమం ద్వారా ఎయిడ్స్ రోగులు 30 మందికి పౌష్టికాహారం అందజేశారు. ప్రతినెలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ చంద్రహాస్, సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రామ్మోహన్‌రావు, పురంధరరాజు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



కారికాడు పాఠశాలలో ఎంఈఓ

దొరవారిసత్రం: కారికాడు, వేలికాడు, మీజూరు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ మస్తానయ్య సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన జగనన్న గోరు ముద్ద నిర్వహణను పరిశీలించడంతో పాటు పాఠశాలలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. అదేవిధంగా విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎంలు మోహన్‌కృష్ణ, లక్ష్మి, విజయానంద్ ఉన్నారు.